
సాక్షి
కర్నూలు
బుధవారం । 1 । మార్చి । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రంలోని శ్రీస్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరునికి, బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.



సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసులకు మంగళవారం 1,730 క్యూసెక్కుల నీరు రాగా కేసీ కాల్వకు 1,325 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



అష్టాదళ పాద పద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీ చౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

మార్కెట్ చెక్‌పోస్టుల తనిఖీలకు శ్రీకారం



మార్కెట్ కమిటీ చెక్‌పోస్టుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు సంబంధించిన చెక్‌పోస్టుల్లో 24 గంటల పాటు మహా చెక్‌కు మార్కెటింగ్ శాఖ అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న 12 చెక్‌పోస్టుల్లో ఉదయం నుంచి తనిఖీలు చేపట్టారు. మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి, మంత్రాలయం, కోసిగి, ఎమ్మిగనూరు, ఆదోని మార్కెట్ యార్డులకు చెందిన చెక్ పోస్టుల్లో తనిఖీలు చేశారు. బుధవారం ఉదయం వరకు మహా చెక్ జరుగుతుంది. మార్కెట్ కమిటీల ఆదాయం పక్కదారి పట్టకుండా చూడటమే మహా చెక్ ఉద్దేశమని ఏడీ నారాయణమూర్తి తెలిపారు. చెక్‌పోస్టుల తనిఖీలకు మరోవైపు రెండు విజిలెన్స్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విజేతలతో విద్యాశాఖ ఉన్నతాధికారులు

కర్నూలు కల్చరల్: విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గూడూరు మండలం పెంచికలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని షాహిన్ బీ ప్రదర్శించిన నమూనాకు మూడో బహుమతి లభించింది. ఈ నేపథ్యంలో సదరు విద్యార్థినితో పాటు గైడ్ టీచర్ ఆర్.శ్రీలక్ష్మిని విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రతాప్‌రెడ్డి, కృష్ణా, కర్నూలు డీఈఓలు తాహెరా సుల్తానా, రంగారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ అభినందనలు తెలిపారు.

సీవీ రామన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న సెట్కూరు సీఈఓ పీవీ రమణ

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థులు సీవీ రామన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సైన్స్‌లో రాణించాలని సెట్కూరు సీఈఓ పీవీ రమణ అన్నారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ రమణ మాట్లాడుతూ జాతీయ సైన్స్ దినోత్సవం రోజున విద్యార్థులకు సైన్స్ గొప్పతనం తెలిపే విధంగా వైజ్ఞానిక సదస్సులు, చర్చాగోష్ఠులు, విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎస్.ఆయేషా, ఎం.సైఫ్, జి.సాయిసృజన్, డి.జోష్‌మార్టిన్, టి.మార్టిన్‌లకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెయింట్‌జోసఫ్ కాలేజీ డీన్ శౌరిల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సీవీ సత్యనారాయణ, కల్చరల్ లిటరరి యాక్టివిటీస్ చైర్మన్ ఆశా పర్వీన్, సెట్కూరు మేనేజర్ జి. సత్యనారాయణ, సూపరింటెండెంట్ రాజేశ్వరి పాల్గొన్నారు.

పట్టణాల్లో కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు

కర్నూలు(హాస్పిటల్): పట్టణాల్లో కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించే ప్రత్యేక కార్యక్రమం మార్చి ఒకటో తేది నుంచి జిల్లాలో ప్రారంభం కానుంది. ఈ మేరకు కర్నూలుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వార్డు సచివాలయాల సిబ్బంది, ఏఎన్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. మార్చి 21వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి తిరిగి సర్వే చేసి డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. చర్మంపై స్పర్శలేని మచ్చలు, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, కాళ్ల నుంచి చెప్పులు జారిపోవడం, చెవులపై కణితలు రావడం కుష్టువ్యాధి ప్రాథమిక లక్షణాలు. ఇవి కనిపిస్తే సమీప పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యున్ని సంప్రదిస్తే వారు పరీక్ష చేసి వ్యాధి నిర్ధారణ చేస్తారు. అంగవైకల్యం ఉన్న కుష్టువ్యాధిగ్రస్తులకు శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎయిడ్స్, లెప్రసి, టీబీ అధికారి ఎల్. భాస్కర్ చెప్పారు. ఈ వ్యాధికి ఎండీటీ మందులు ఉచితంగా లభిస్తాయన్నారు.

పత్తికొండ ప్రాంతంలో హంద్రీనీవా సుజల స్రవంతి కింద సాగు చేసిన పంటలు



ప్రభుత్వం చూపు.. పశ్చిమం వైపు

పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. వచ్చే ఐదేళ్లలో కరువు ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో 2023–24 నుంచే కార్యాచరణ మొదలుపెట్టింది. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు, నీటి పారుదల సౌకర్యాల మెరుగుతో పాటు జిల్లాకు కేటాయించిన లక్ష్యాల్లో 75 శాతం పశ్చిమ ప్రాంత అభివృద్ధికే ఖర్చు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

- ఐదేళ్లలో పశ్చిమ ప్రాంతం సమగ్ర అభివృద్ధికి చర్యలు
- గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆదోని ఏరియా అభివృద్ధికి ప్రభుత్వ కృషి
- ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు
- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ఆదోని డివిజన్ పూర్తిగా వర్షాధార ప్రాంతం. వాన ఎక్కువైనా, తక్కువైనా ఇక్కడ పంటలు పండవు. ఫలితంగా ఏటా కరువు విలయతాండవం చేస్తోంది. అరకొరగా పంటలు పండితే కూలీలకు డిసెంబరు వరకు పనులు ఉంటాయి. తర్వాత పనులు లేక ఇతర ప్రాంతాలకు ఇంటిల్లిపాది వలస వెళ్తున్నారు. విషయం గ్రహించిన ప్రభుత్వం పశ్చిమ ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది. దీనికి ఐఏఎస్ అధికారి, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ నేతృత్వం వహిస్తున్నారు. 2026–27 నాటికి పశ్చిమ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

సెస్‌తో అధ్యయనం..

పశ్చిమ ప్రాంత అభివృద్ధి ఎలా సాధ్యం అనే దానిపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) సంస్థను నియమించింది. ఈ సంస్థ దాదాపు ఆరు నెలల పాటు ఆదోని డివిజన్‌లోని వివిధ మండలాల్లో పర్యటించి అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించి దాదాపు 160 పేజీల నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. నీటిపారుదల, మౌలిక సదుపాయాలను విస్తరింపజేయడం ద్వారా పశ్చిమ ప్రాంతం నుంచి వలసలు నియంత్రించొచ్చని ఈ సంస్థ అభిప్రాయ పడింది.

వ్యవసాయ అనుబంధ శాఖలే కీలకం

ఆదోని ఏరియా అభివృద్ధిలో వ్యవసాయ అనుబంధ శాఖలే కీలకం కానున్నాయి. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే నీటిపారుదల అత్యవసరం. ఈ నేపథ్యంలో ఇక్కడ ఎల్లెల్సీ, తుంగభద్ర నదీ, హంద్రీనీవా సుజల స్రవంతి, వేదావతి నదుల ద్వారా నీటిపారుదల సదుపాయం కల్పించడంపై సర్కారు దృష్టి సారించింది. బోర్లు, బావులు ఉంటే 70 నుంచి 90 శాతం సబ్సిడీపై సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పిస్తారు. బోర్లు, బావులు లేకపోతే ఫాంపాండ్స్ తవ్వి కాల్వల ద్వారా వాటికి నీటిని సరఫరా చేసి సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పిస్తారు. ఏపీఎంఐపీ ద్వారా పశ్చిమ ప్రాంతంలో బిందు, తుంపర్ల సేద్యానికి ప్రాధాన్యత ఇస్తారు.

- డీఆర్‌డీఏ–వైకేపీ ద్వారా స్త్రీనిధి, ఉన్నతి పథకంతో పాటు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించి బడుగు బలహీన వర్గాల ప్రజలకు రుణ సదుపాయం కల్పించి పాడి అభివృద్ధి, పెరటి కోళ్ల పెంపకం, పొట్టేళ్లు, గొర్రెలు, మేకల పెంపకం, కిరాణం షాపులు, టైలరింగ్ తదితర వాటిల్లో రాణించే విధంగా చర్యలు చేపట్టారు.

“ ఉపాధి నిధులతో పశ్చిమ ప్రాంత అభివృద్ధి



ఉపాధి నిధులతో ఆదోని ఏరియా అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నాం. పశ్చిమ ప్రాంత అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) సంస్థ అధ్యయనం చేసి నివేదిక ఇచ్చింది. ఆదోని ప్రాంత అభివృద్ధిలో ఏఏ శాఖల భాగస్వామ్యం ఎంతుంది అనే దానిపై నివేదికలో వివరించారు. ఉపాధి హామీ పథకం కింద అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరికీ మంచి వేతనం వచ్చే విధంగా చూస్తున్నాం. వంద శాతం సబ్సిడీతో పండ్లతోటల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నాం. జీవనోపాధులను అభివృద్ధి చేసుకోవడానికి ఆరు నెలలకే కాపునకు వచ్చే మునగ సాగును ప్రోత్సహిస్తున్నాం.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

“ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత



పశ్చిమ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. డీఆర్‌డీఏ–వైకేపీతో టైఅప్ అయి సోలార్ డ్రయ్యర్ల ద్వారా ఆనియన్ ఫ్లేక్స్ తయారీ యూనిట్లు పెద్ద ఎత్తున ఇవ్వనున్నాం. ఇందువల్ల మహిళల జీవనోపాధి మెరుగవుతుంది. ఉల్లికి డిమాండ్ వస్తుంది. కప్పట్రాళ్లలో ఉల్లి ప్రాసెసింగ్ ఇండస్ట్రీ నెలకొల్పాలనే ప్రతిపాదన ఉంది. టమాటా ప్రాసెసింగ్ యూనిట్లు కూడా ఏర్పాటు చేస్తాం. ఆదోని మండలంలో మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. పండించిన పంటలకు డిమాండ్ వస్తుంది.

– ఉమాదేవి, ఈడీ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ

- ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా దేవనకొండ మండలం కప్పట్రాళ్లలో రూ.50 కోట్లతో సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఫర్ విజిటబుల్ (ఉల్లి) యూనిట్‌ను నెలకొల్పనున్నారు. టమాటా ఎక్కువగా పండే ప్రాంతాల్లో మినీ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పనున్నారు. ఆదోని మండలంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కింద ఉల్లి(ఆనియన్) ఫ్లేక్స్ నెలకొల్పనున్నారు. ఎస్‌ఫోర్‌ఎస్ టెక్నాలజీతో సోలార్ డ్రయర్ల ద్వారా ఆనియన్ ఫ్లేక్స్ తయారీకి చర్యలు చేపట్టారు.



ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన సోలార్ డ్రయర్ ద్వారా తయారు చేసిన ఉల్లి ఫ్లేక్స్

- ఉద్యాన శాఖ ద్వారా ఉద్యాన పంటల విస్తరణ కింద జిల్లాకు కేటాయించే లక్ష్యాల్లో 75 శాతం ఆదోని ఏరియా అభివృద్ధికే వినియోగించనున్నారు. సాగుకు పనికి రాని 2,000 ఎకరాల భూముల్లో వెదురు అభివృద్ధి చేయనున్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా గొర్రెలు, పొట్టేళ్లు, మేకల పెంపకాన్ని ప్రోత్సహించనున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే విధంగా రైతులను ప్రోత్సహిస్తారు. పండించిన పంటలకు తగిన మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తారు. చేనేత–జౌళిశాఖ, ఇండస్ట్రీస్ ద్వారా టెక్స్‌టైల్స్ పరిశ్రమ ఏర్పాటు చేయ తలపెట్టారు. ఇందుకు బ్యాంకులు పెద్ద ఎత్తున రుణాలు ఇస్తాయి.

నేటి నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ

- ఉమ్మడి జిల్లాకు రూ.126.32 కోట్లు
- ఆధార్ ముఖ గుర్తింపు ద్వారా కూడా పింఛన్ల పంపిణీ
- ఉదయం 5 గంటల నుంచే మొదలు



కర్నూలు(అగ్రికల్చర్): ఒకటో తేదీ వస్తుందంటే చాలు.. ముంగిట్లో ఆనందం ఎదురొస్తుంది. వైఎస్సార్ పెన్షన్ కానుకను గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటికే వచ్చి నగదు అందిస్తుంటే లబ్ధిదారుల ముఖంలో చిరునవ్వు కనిపిస్తుంది. మార్చి నెల పింఛన్లను 1 నుంచి 5వ తేదీ వరకు పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.126.32 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులను సంబంధిత బ్యాంకుల నుంచి వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేశారని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య స్పష్టం చేశారు. టీడీపీ పాలనలో పింఛను పొందాలంటే తల ప్రాణం తోకకు వచ్చేది. అంతంత మాత్రం వచ్చే పింఛను కోసం గ్రామ పంచాయతీలు, రచ్చ బండల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిందే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ బాధలను తొలగించింది. ఇంటి వద్దకే పింఛను నడిచి వస్తోంది. తెల్లవారక ముందే పింఛను సొమ్ము చేతికి అందుతోంది. కర్నూలు జిల్లాలో 2,39,026 పింఛన్లకు రూ.66.44కోట్లు, నంద్యాల జిల్లాలో 2,16,981 పింఛన్లకు రూ.59.87 కోట్లు పంపిణీ చేయడానికి డీఆర్‌డీఏ–వైకేపీ ఏర్పాట్లు చేసింది.

ముఖ గుర్తింపు ద్వారా కూడా పింఛన్ల పంపిణీ..

బయోమెట్రిక్ ద్వారా ఫించన్లు పంపిణీ చేస్తున్నారు. వేలిముద్రలు పడకపోతే ఐరీస్ ఆధారంగా అందిస్తారు. మార్చి నుంచి వేలిముద్రలు, ఐరీస్ ఫెయిల్ అయితే ఆధార్ ఆధారంగా ముఖ గుర్తింపుతోనూ పింఛను పంపిణీ చేయనున్నారు. ఇది కూడా వీలుకాని పక్షంలో మూడో రోజు నుంచి ఆర్‌బీఐఎస్ యాప్ ద్వారా పింఛనుదారుల ఫొటో తీసి పింఛను సొమ్ము ముట్టజెప్పనున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 11న ఎన్నికల బ్యాలెట్ పేపర్ల అందజేత
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో గ్రాఫర్ల ఏర్పాటు
- ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమీక్షలో రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్ ఆదేశం



కర్నూలు(సెంట్రల్): కడప–అనంతపురం–కర్నూలు పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రిటర్ని ంగ్ అధికారి, అనంతపురం జిల్లా ఇన్ చార్జ్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన అనంతపురం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉమ్మడి వైఎస్సార్, అనంతపురం, కర్నూలు జిల్లాల అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి ఎన్నికల ఏర్పాట్లపై మాట్లాడిన వివరాలివీ..

- బ్యాలెట్ పేపర్లను అనంతపురం కలెక్టరేట్ నుంచి మార్చి11వ తేదీన ఉదయం 9 గంటలకు అన్ని జిల్లాల అధికారులు బందోబస్తు మధ్య తీసుకెళ్లి పోలింగ్ కేంద్రాలకు సమీపంలో వాటిని భద్రపరచుకోవాలి.
- ఎన్నికల శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఆయా జిల్లాల ఎస్పీలు బందోబస్తును ఏర్పాటు చేయాలి.
- ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులకు శిక్షణ కార్యక్రమాలు వెంటనే నిర్వహించాలి
- ప్రతి పోలింగ్ కేంద్రంలో మైక్రో అబ్జర్వర్, వెబ్ కాస్టింగ్ అందుబాటులో ఉండాలి.
- ఎన్నికల ర్యాలీలు, సభలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు. ఇందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లతోపాటు వీడియో గ్రాఫర్లను నియమించుకోవాలి.
- ఓటర్లకు ప్రాధాన్యత క్రమంపై అవగాహన సదస్సులు
- మార్చి 7వ తేదీలోపు ఓటర్లకు ఓటరు స్లిప్పుల పంపిణీ
- 13న ఎన్నికలు ముగిసిన వెంటనే స్థానికంగా ఏర్పాటు చేసుకున్న స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ బాక్సులు భద్రపరచాలి.
- 14న అక్కడి నుంచి అనంతపురంలోని జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు వాటిని తరలించాలి.
- 15న కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ, 16న ఎన్నికల ఫలితాల ప్రకటన ఉంటుంది.

రైతన్నలకు అన్ని విధాలుగా అండ



రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న అధికారులు

- వైఎస్‌ఆర్ రైతు భరోసా– పీఎం కిసాన్ మూడో విడత జమ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి
- జిల్లాలో 2,79,576 మందికి రూ.59.06 కోట్లు జమ

కర్నూలు(సెంట్రల్): తమ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలబడుతోందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వరుసగా నాలుగో ఏడాదిలో వైఎస్‌ఆర్ రైతు భరోసా–పీఎం కిసాన్ మూడో విడత సాయాన్ని మంగళవారం తెనాలి నుంచి ఆయన బటన్ నొక్కి నేరుగా రైతన్న ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశానికి అన్నం పెట్టే రైతన్న కన్నీరు కార్చకూడదన్నారు. అందుకే తాము రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నామన్నారు. ఏడాదికి పెట్టుబడి రాయితీ రూ.13,500 నగదు తోపాటు ఎరువులు, విత్తనాలు అందిస్తున్నామన్నారు. పంటలకు మద్దతు ధరలు లేకపోతే ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

జిల్లాలో 2.79 లక్షల మంది రైతులకు లబ్ధి

వైఎస్‌ఆర్ రైతు భరోసా పీఎం కిసాన్ కింద జిల్లాలో 2,79,576 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో మొదటి విడత కింద మే మాసంలో రూ.7,500, రెండో విడత కింద అక్టోబర్‌లో రూ.4 వేలు అందజేశారు. ఈ క్రమంలో మూడో విడత కింద మంగళవారం ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు జమ చేశారు. జిల్లాలోని 2,79,576 మందికి కలిపి రూ. 59.06 కోట్లు విడుదల చేశారు. ఇందులో 2,75,799 మంది రైతులకు ఒక్కొక్కరికీ రూ. 2 వేలు చొప్పున రూ.55.15 కోట్లు, ఆర్‌ఓఎఫ్ ఆర్ పట్టాలు పొందిన నలుగురికి రూ.8 వేలు, 3,690 మంది కౌలు రైతులకు రూ.2.61 లక్షలు జమ చేశారు. కాగా, మూడో విడత కింద జమైన నగదుకు సంబంధించిన మెగా చెక్కును అధికారులు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, పశుసంవర్ధక శాఖ అధికారి రామచంద్రయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట నారాయణ పాల్గొన్నారు.

నియోజకవర్గం	రైతుల సంఖ్య	జమ (రూ.కోట్లలో)
కోడుమూరు	37,033	7.57
ఎమ్మిగనూరు	38,492	7.77
మంత్రాలయం	42,111	8.52
ఆదోని	19,014	3.86
పత్తికొండ	56,345	11.29
పాణ్యం	21,693	4.43
ఆలూరు	64,535	12.96
మొత్తం	2,79,576	59.06

విద్యుత్ అధికారులపై చర్యలకు సిఫార్సు

- ఇప్పటికే ఇద్దరు ఏఈల సస్పెన్షన్
- తాజాగా డీఈఈ, ఈఈల పనితీరుపై ఉన్నతాధికారులకు నివేదిక

కర్నూలు(రాజ్‌విహార్): విధుల పట్ల నిర్లక్ష్యం వహించి తప్పుడు కనెక్షన్లు ఇచ్చి, వినియోగదారుడిని తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన కేసులో మరి కొంత మంది విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోనున్నారు. 20 కిలో వాట్స్ విద్యుత్ లోడు ఉన్న త్రీఫేజ్ కనెక్షన్‌కు సీటీ మీటర్ (24 గంటల్లో ఏ గంటకు ఎన్ని యూనిట్లు వాడారో లెక్క చూపుతుంది)ను అమర్చాలి. ఇది మీటర్స్ అండ్ ప్రొటెక్షన్ ఈఈ, డీఈఈల పర్యవేక్షణలో జరగాలి. అయితే గతంలో ఆదోనిలోని ఓ వినియోగదారుడికి ఈ మీటర్‌ను అమర్చడంలో తీవ్ర నిర్లక్ష్యం జరిగింది. సీటీ మీటర్‌కు రాంగ్ కనెక్షన్ ఇవ్వడంతో వినియోగదారుడికి భారీగా విద్యుత్ బిల్లు రావడంతో అతను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనికి అప్పట్లో సీటీ మీటర్స్ విభాగంలో పని చేస్తున్న, ప్రస్తుత కర్నూలు రూరల్స్ ఏఈ ఆంజనేయ శాస్త్రితో పాటు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మరో ఏఈ అనిల్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి సోమవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఇదే అంశంలో ఎం అండ్ పీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుతో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల వైఫల్యాలు, లోపాలను వివరిస్తూ వారిపై కూడా చర్యలు తీసుకోవాలని మంగళవారం తిరుపతిలోని ప్రధాన కార్యాలయానికి నివేదికలు పంపినట్లు సమాచారం. త్వరలో మరికొంతమందిపై కూడా చర్యలు ఉంటాయని విద్యుత్ శాఖలో చర్చ జరుగుతోంది.

జగమేలు నాయక.. జగదానందకారక

- హంస, సూర్యప్రభ వాహనాలపై దర్శనమిచ్చిన ప్రహ్లాదవరదుడు
- హనుమంత వాహనంపై ఊరేగిన జ్వాల నరసింహుడు



హనుమంతుడి వాహనంపై జ్వాల నరసింహస్వామి,



సూర్యప్రభ వాహనంపై కొలువైన ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: అహోబిల దివ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దిగువ అహోబిలంలో ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం తెల్లవారుజామునే నిత్యపూజలు చేసి స్వామి అమ్మవార్లను అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకాలంకరణలో ఉన్న హంస వాహనంపై స్వామిని కొలువుంచి మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణలతో మాడవీధుల్లో వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి అహోబిల మఠం చేరుకున్న హంస వాహనాధీశుడైన అహోబిలేశునికి మఠం పీఠాధిపతి శ్రీ రంగరాజయతీంద్ర మహాదేశికన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సూర్యప్రభ వాహనంపై స్వామిని కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు.

ఎగువ అహోబిలంలో..

ఎగువ అహోబిలంలో కొలువైన శ్రీ జ్వాలనృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన హనుమంత వాహనంపై శ్రీ జ్వాలనరసింహస్వామి విహరించారు.

క్లుప్తంగా

భానుముక్కల పరిసరాల్లో పులి సంచారం

పాములపాడు: మండలంలోని భానుముక్కల గ్రామ సమీపంలో మంగళవారం పులి కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు. రెండు రోజులుగా ఆత్మకూరు మండలం కరివేన, నల్లకాల్వ గ్రామాల పరిసరాల్లో కనిపించిన పులి మంగళవారం భానుముక్కల పరిసర ప్రాంతాల్లో ఓ మహిళకు కనిపించింది. దుస్తులు ఉతుక్కునేందుకు చాకిరేవు వద్దకు మహిళ వెళ్తుండగా కుంట వద్ద పులి కనిపించింది. భయాందోళనతో మహిళ గట్టిగా కేకలు వేస్తూ పరుగులు తీయడంతో అటుగా వెళ్తున్న మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తులు, సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు అక్కడికి చేరుకుని కేకలు వేయడంతో పులి అడవి వైపు వెళ్లినట్లు సమాచారం. ఈ విషయం గ్రామంలో తెలియడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహానందీశ్వరుడికి రూ.48.76 లక్షల ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మహానంది: హుండీ కానుకల ద్వారా మహానందీశ్వరుడికి రూ.48.76 లక్షలు ఆదాయం లభించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అభిషేక మండపంలో మంగళవారం హుండీ కానుకలను లెక్కించారు. శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వర, కోదండరామాలయం, ఆంజనేయ, వినాయకనంది ఆలయాల ద్వారా రూ.47,84,402, అన్నదాన విభాగం ద్వారా రూ.66,027, గోశాల ద్వారా రూ.26,289 ఆదాయం వచ్చిందన్నారు. వీటితో పాటు యూఎస్‌ఏ, యూఏఈ, కత్తర్, ఆస్ట్రేలియా దేశాల కరెన్సీ లభించిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వై.మధు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరుడు, ధర్మకర్త బుసకాని వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

పాణ్యం: కందికాయపల్లె గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో కొండల్లో గుర్తు తెలియని వ్యక్తి శవం ఉందని ఎస్ఐ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మృతుడికి సుమారు 60 ఏళ్ల వయస్సు, ఐదు అడుగు ఎత్తు ఉండి తెల్లటి బనియన్, గ్రే కలర్ డ్రాయర్ ధరించినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 9121101096కు సమాచారం అందించాలన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	రూ. 4399	రూ. 7770
పొద్దుతిరుగుడు	రూ. 4319	రూ. 4909
ఆముదం	రూ. 4049	రూ. 6334
వాము	రూ. 6869	రూ. 20100
ఉల్లి	రూ. 330	రూ. 859
ఎండు మిర్చి	రూ. 8919	రూ. 38786
శనగలు	రూ. 4559	రూ. 4670
కందులు	రూ. 2682	రూ. 8070
మొక్కజొన్న	రూ. 1839	రూ. 2090
మినుములు	రూ. 3816	రూ. 7040

కొండ ప్రశ్నించదని.. అధికారులకు కళ్లు లేవని..!



మట్టి తరలింపునకు క్లస్టర్ యూనివర్సిటీ కంచె తొలగించిన దృశ్యం



టిడ్కో ఇళ్ల సమీపంలో కొండను పూర్తిగా తవ్వి మట్టి తరలించడంతో మిగిలిన గుంతలు




హమ్మయ్య.. నన్ను వదిలేశారు

జగన్నాథ గట్టు.. మతసామరస్యానికి ప్రతీకగా ఆంజనేయస్వామి విగ్రహం, ఆ పక్కనే దర్గా కనిపిస్తుంది. ఎత్తయిన ఈ కొండ నగర శివారులో ఎంతో ఆహ్లాదాన్ని పంచుతోంది. ఇప్పుడు ఈ చుట్టు పక్క ప్రాంతమంతా రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడం, ఇక్కడే కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల నిర్మాణం జరుగుతుండటంతో జనజీవనానికి అనువుగా మారింది. ఇటీవల రింగ్ రోడ్డు కూడా పూర్తి కావడంతో వాహనాల రాకపోకలు అధికమై నివాస ప్రాంతాలు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ వెంచర్లు వేసిన రియల్టర్ల కన్ను జగన్నాథ గట్టుపై పడింది. ఆంజనేయస్వామి అడగడు అనుకున్నారో.. అధికారులు మనోళ్లే అని భావించారో.. ఏకంగా కొండనే తవ్వడం మొదలు పెట్టారు. పేదలకిచ్చిన పొలాలను నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు.. ఆ పక్కనే ఉన్న కొండను, ఖాళీ స్థలాన్ని తవ్వి తమ స్థలంలో కలిపేసుకోవడం మొదలు పెట్టారు. ఇక టిడ్కో ఇళ్లకు ఎదురుగా ఒకప్పుడు కొండ ఉండేది అన్నట్లుగా తవ్వకాలు చేయడం అధికారుల చిత్తశుద్ధికి అద్దం పడుతోంది. ఇంకొద్ది రోజులు పోతే అంజన్న స్వామి కొండ దిగిరాక తప్పదన్నట్లుగా తవ్వకాలు రేయింబవళ్లు కొనసాగిస్తుండటం నగర ప్రజల గుండెలను పిండేస్తోంది.

– ఫొటోలు: డి.హుస్సేన్



ఆంజనేయుడే నిలువెత్తు సాక్ష్యంగా తవ్వకం



ఓ ప్రయివేట్ వెంచర్ దాటుకొని కరిగిపోతున్న కొండ



రింగు రోడ్డు పక్కనే దర్జాగా చదును చేస్తూ..

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



మృతి చెందిన కంబయ్య

కొలిమిగుండ్ల: బెలుం ఎస్సీ కాలనీకి చెందిన గని కార్మికుడు బందెల కంబయ్య (35) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కంబయ్య రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం నాపరాతి గనిలో పనికి వెళ్లాడు. విద్యుత్ కోత మిషన్‌తో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. తోటి కార్మికులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అక్కడే పని చేస్తున్న మరో కార్మికుడు దిలీప్ గాయాలతో బయట పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య



రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న బోయ ఎర్రమల

కర్నూలు : కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామానికి చెందిన బోయ ఎర్రమల (36) కుటుంబ సమస్యల కారణంగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగించే ఈయన భార్య ఉపాధి నిమిత్తం కొన్నాళ్ల క్రితం గుంటూరు వెళ్లింది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. కుటుంబ సమస్యల కారణంగా మంగళవారం మధ్యాహ్నం దూపాడు దగ్గర ట్రాక్ మెయింటెనెన్స్ ఇంజన్ వెళ్తుండగా ఎదురెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్యచికిత్సలు చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. తల్లి లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబర్ 2022లో జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, నాలుగవ సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య సి.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఫలితాలు rayalaseema university.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మార్చి 6వ తేదీ వరకు రీవాల్యుయేషన్‌కు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. డిగ్రీ రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 11,270 మంది హాజరు కాగా 4,578 మంది, సప్లిమెంటరీ పరీక్షలకు 5,171 మందికి 1,679 మంది, నాలుగవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 12,361 మందికి 5,371 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

నిర్లక్ష్యానికి రెండు ప్రాణాలు బలి

- నూర్పిడి యంత్రం బోల్తా పడి ఇద్దరు కూలీలు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- త్రుటిలో తప్పించుకున్న మరో ముగ్గురు
- కుమారుడితో వాహనాన్ని నడిపించిన డ్రైవర్
- శాతనకోటలో విషాదం



నాగలక్ష్మమ్మ (ఫైల్)



అనురాధ (ఫైల్)

జూపాడుబంగ్లా: వ్యవసాయ పనులకు వెళ్లిన కూలీలు మరో అరగంటలో ఇంటికి చేరాల్సి ఉండగా ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి బలయ్యారు. నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శాతనకోట గ్రామానికి చెందిన తెలుగు నాగలక్ష్మమ్మ(46), జి.అనురాధ(30) ఖాజాబీ, శివలక్ష్మమ్మ, రాధమ్మ, నూరాణి అదే గ్రామానికి చెందిన వెంకటస్వామి అనే రైతు మినుము పంటను నూర్పిడి చేసేందుకు వెంకటేశ్వర్లుకు చెందిన నూర్పిడి యంత్రాన్ని ట్రాక్టర్‌కు తగిలించుకొని పొలానికి వెళ్లారు. నూర్పిడి పనులు ముగించుకొని ట్రాక్టర్, నూర్పిడియంత్రంతో వ్యవసాయ కూలీలు ఇళ్లకు బయలుదేరారు. మరో అరగంటలో ఇళ్లకు చేరుకోవాల్సి ఉండగా డ్రైవర్ వెంకటేశ్వర్లు మైనర్ అయిన కుమారుడి చేత వాహనాన్ని డ్రైవింగ్ చేయించారు. వేగాన్ని అదుపు చేయకపోవడంతో నూర్పిడి యంత్రం బోల్తా పడింది. దానిపై కూర్చున్న నాగలక్ష్మమ్మ, అనురాధ అక్కడికక్కడే మృతి చెందగా ఖాజాబీకి కాలు విరిగింది. ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చున్న శివలక్ష్మమ్మ, రాధమ్మ, నూరాణి ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ ఓబులేసు, పట్టణ రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి సంఘటన ప్రాంతానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వర్లు, అతని కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలకు నందికొట్కూరు ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చేయడంతోపాటు అండగా ఉంటానని భరోసా నిచ్చారు.

కుమారుడి పెళ్లి చూడకుండానే..

మృతురాలు నాగలక్ష్మమ్మకు భర్త పరశురాముడు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, పెద్ద కుమారుని వివాహం ఇటీవల నిశ్చయమైంది. ఈ వేసవిలో ముహూర్తం నిర్ణయించి పెళ్లి పనులు మొదలు పెట్టారు. కాగా కుమారుని పెళ్లి చూడకుండా నాగలక్ష్మమ్మ మృతిచెందటంతో కుటుంబ సభ్యులు, బంధువులు విలపిస్తున్నారు.



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

తల్లిని కోల్పోయి.. తల్లడిల్లి



తల్లిని కోల్పోయిన ముగ్గురు కుమారులు

మృతురాలు అనురాధకు భర్త నరసింహులు, ముగ్గురు కుమారులు ఉన్నారు. పిల్లలందరూ పదేళ్లలోపు వారే. తల్లి మృతదేహంపై పడి వారు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. అమ్మా.. లేమ్మా అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతులిద్దరూ వరుసకు అక్కాచెల్లెళ్లు కావడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. నిత్యం వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ సరదాగా ఉండే ఇద్దరు మహిళలు మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

వేసవిలో తాగు నీటి ఎద్దడి రానివ్వొద్దు

- పారిశుధ్య చర్యలపైనా దృష్టి సారించండి. • జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: వేసవి సమీపిస్తుండటంతో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో తాగునీటి సరఫరా, పబ్లిక్ హెల్త్, పారిశుధ్య చర్యలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ చూసినా పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈఓఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు, మున్సిపాలిటీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. వీధుల్లో పందులు, కుక్కల బెడద నివారణకు ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. నంద్యాల పట్టణానికి కేసీ కెనాల్ వెలుగోడు రిజర్వాయర్, డోన్ పురపాలక సంఘానికి గాజులదిన్నె ప్రాజెక్ట్, నందికొట్కూరు మున్సిపాలిటీకి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, ఆళ్లగడ్డ నగర పంచాయతీకి గండలేరు రిజర్వాయర్, ఆత్మకూరు మున్సిపాలిటీకి వెలుగోడు రిజర్వాయర్, బేతంచెర్ల నగర పంచాయతీకి గ్రౌండ్ వాటర్ (పవర్ బోర్ వెల్స్)కు సంబంధించి పైపులైను లీకేజీ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర రక్షిత మంచినీటి పథకాల ద్వారా తాగు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయడంతో పాటు 15 రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. ఇక మురుగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డీపీఓ శ్రీనివాసులు, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ గంగాధర్, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ, భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి



మాట్లాడుతున్న అటవీ శాఖ రేంజర్ సూర్యచంద్రరాజు

కర్నూలు కల్చరల్: వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా అటవీ అధికారి శివశంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో కర్నూలు నగర వనంలో కృష్ణవేణి ఐటీఐ కళాశాల విద్యార్థులకు వన్యప్రాణులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ ఏ ప్రాణికి అపాయం తలపెట్టకూడదన్నారు. అడవులను, అడవి జాతులను రక్షించుకోవాలన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సూర్యచంద్రరాజు మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ పర్యావరణ సమతుల్యానికి ఎంతో ముఖ్యమన్నారు. ఏపీ స్టేట్ ఎనిమల్ వెల్ఫేర్ బోర్డు మెంబర్, స్నేక్ రెస్క్యూయర్ మహమ్మద్ ఇద్రిస్ జిల్లాలోని వివిధ వన్యప్రాణులపై అవగాహన కల్పించారు. పాముల జీవన విధానం, రకాలు, వ్యవసాయంలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు జయమ్మ, శకుంతలమ్మ, రేణుక, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తతే రక్షణ!

- పశువులకు సోకే ప్రమాదకర వ్యాధి గాలికుంటు
- ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేయించడం అవసరం
- నేటి నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో వ్యాక్సినేషన్ కార్యక్రమం



పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రవిబాబు

కర్నూలు (అగ్రికల్చర్): పశువుల విలువ అపారంగా పెరిగింది. వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటే పాడి, వ్యవసాయంలో రాణించవచ్చు. అలాంటి పశువులకు సోకే వ్యాధుల్లో ప్రమాదకరమైంది గాలికుంటు. వేగంగా గాలి ద్వారా వ్యాపించే ఈ వ్యాధి వైరస్ ప్రస్తుతం లేకపోయినా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అనుమానం కలిగిన వెంటనే వ్యాధి సోకని ప్రాంతాల్లో కూడా నివారణ చర్యలు చేపట్టాలి. లేకపోతే పశువుల ఉత్పాదక శక్తి సామర్థ్యం తగ్గిపోవడంతో పాటు కొన్ని సార్లు పశు మరణాలు జరిగే ప్రమాదం లేకపోలేదు.

వ్యాధి లక్షణాలు ఇలా..

- శరీర ఉష్ణోగ్రత 104–1–6 డిగ్రీల ఫారన్‌హీట్ వరకు ఉంటుంది. నోటి ఎపిథీలియా, పళ్ల చిగుళ్లు, నాలుక, ముట్టె, లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి అవి 24 గంటల్లో చితికి పోతాయి. తర్వాత గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి నొప్పి కలగడం ద్వారా పశువులు సరిగా నడవలేక కుంటుతుంటాయి. ఒక్కోసారి పొదుగుపై బొబ్బలు ఏర్పడి వాపు సంభవిస్తుంది. బాక్టీరియా బొబ్బలను ఆశించడం వల్ల చీముతో కూడిన పుండ్లు తయారై చిరాకును కలిగిస్తాయి.
- వ్యాధి సోకిన పశువుల పాలు దూడలు తాగితే మరణిస్తాయి. పాడిపశువుల్లో పాల ఉత్పత్తి ఆకస్మాత్తుగా తగ్గుతుంది. చూలి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి.
- వ్యాధిగ్రస్త పశువులు 2,3 రోజుల్లో మేత తినడం ప్రారంభించినా వ్యాధి కలిగించే దుష్ఫలితాల నుంచి కోలుకోవడానికి ఆరు మాసాలు పడుతుంది.

నివారణ ఇలా... : ప్రస్తుతం గాలికుంటు వ్యాధి లేదు. 2015లో అక్కడక్కడ కేసులు కనిపించాయి. తర్వాత గాలికుంటు కేసులు ఎక్కడా నమోదు కాలేదు. ఈ వ్యాధికి చికిత్స వ్యయ ప్రయాసతో కూడుకున్నందున నివారణ మార్గాలపై శ్రద్ధ వహించాలి. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఏడాదికోసారి క్రమం తప్పకుండా వేయించాలి. టీకాలు వేసిన తర్వాత 1–3 వారాల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొంది ఏడాది పాటు వ్యాధి సోకకుండా కుంటుంది. నిండు చూడిగా ఉన్న పశువులను ఈనిన తర్వాత టీకాలు వేయిస్తే మంచిది. ఈ వ్యాధి అన్ని కాలాల్లో కనిపిస్తుంటుంది. అందువల్ల ప్రతి ఏటా పశువులకు అన్ని వైరస్ స్ట్రైయిన్‌లతో కూడిన టీకాలు వేయించాలి.

నేటి నుంచి టీకాలు... : గాలికుంటు వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఏటా జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి జిల్లాలో నల్ల, తెల్ల జాతి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు పశుసంవర్ధక శాఖ ఏర్పాట్లు చేసింది. కర్నూలులోని ఉమ్మడి జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం నుంచి కర్నూలు జిల్లాకు 3,25,800 డోసులు, నంద్యాల జిల్లాకు 3,72,550 డోసుల వ్యాక్సిన్ ఇప్పటికే సరఫరా అయింది. కర్నూలు జిల్లాలోని కర్నూలు డివిజన్‌కు 1,79,800 డోసులు, ఆదోని డివిజన్‌కు 1,46,000, నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ డివిజన్‌కు 1,60,850 డోసులు, నంద్యాల డివిజన్‌కు 2,11,700 డోసుల ప్రకారం సరఫరా చేసినట్లు జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు తెలిపారు.

పట్టుబడిన గంజాయి దహనం



గంజాయిని దహనం చేస్తున్న పోలీసు అధికారులు

బొమ్మలసత్రం: జిల్లా పరిధిలో పట్టుబడిన గంజాయిని డిస్ట్రిక్ట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు కమిటీ మెంబర్ ఎస్సీ, ఎస్టీ డీఎస్పీ రామాంజినాయక్ ఆధ్వర్యంలో దహనం చేశారు. నంద్యాల టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎన్‌డీపీఎస్ కేసుల్లో 720గ్రాములు, పాణ్యం పోలీసు స్టేషన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ కేసుల్లో 20,780 కేజీల సీజ్ చేసిన రూ. 7 లక్షల విలువైన గంజాయిని మంగళవారం స్థానిక విజయడెయిరీ సమీపంలో పోలీసులు కాల్చివేశారు.